క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4.00 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా సమయాలలో మార్పు

రాజుపాలెం: వర్షాలు తగ్గుముఖం పట్టడం, ఎండలు విపరీతం కావడం వలన వ్యవసాయ రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ఏఈ ప్రసాద్ బుధవారం తెలిపారు. కొండమోడు సబ్ స్టేషన్ పరిధిలోని కోటనెమలిపురిలోని రైతులు రాత్రి 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా ఉంటుందని చెప్పారు. అదే విధంగా 11 కేవీ పరిధిలో కోటనెమలిపురిలో ఉన్న రైతులకు రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

సత్తెనపల్లి: పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు ఎస్.సురేష్ కోరారు. మండలంలోని పాకాలపాడు ఎస్సీ కాలనీ లో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమకు ఉన్న హక్కులపై అవగాహన కలిగి వేరొకరికి అవగాహన కల్పించాలన్నారు.

జెడ్పీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



నకరికల్లు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అందిస్తున్నట్లు నరసరావుపేట డెప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబుల వినియోగం, ఐఎఫ్‌బీ ప్యానల్స్ వివరాలు, విద్యార్థులకు పంపిణీ చేసే ఐఎఫ్‌పీ ట్యాబుల వినియోగం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఐఎఫ్‌బీ ప్యానల్స్, ట్యాబుల వినియోగం గురించి డీఎంఓ ఎన్.పూర్ణచంద్రరావు వివరించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు షేక్ నజీర్ అహ్మద్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

పెదకూరపాడు: వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. బుధవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడిగా నియమితుడైన పెదకూరపాడు గ్రామానికి చెందిన నల్లపాటి యోహాన్, ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పరిశీలన

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంఎఫ్ నిధులతో నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, అధికారులను కోరారు.

దస్తావేజులేఖర్ల పెన్ డౌన్



సత్తెనపల్లి: తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు బుధవారం పట్టణంలో దస్తావేజు లేఖలు పెన్‌డౌన్ చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు నల్ల రిబ్బన్లు ధరించి నినాదాలు ఇచ్చారు. రెండు రోజుల పాటు క్రయ విక్రయాలన్నీ నిలిపివేయడం జరుగు తుందని, తాము చేపట్టే ఆందోళనకు ప్రజలు సహకరించాలని కోరారు.

భావనారుషి మందిరానికి భూ విరాళం



పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడులో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి భద్రావతి సమేత భావనారుషి మందిర నిర్మాణానికి బుధవారం సాంబశివరావు సిద్ధాంతి ఐదున్నర సెంట్లు భూమి విరాళం ఇవ్వటం జరిగింది. అలాగే మందిరంలో బోరు పంపు నిర్మాణానికి 60 వేల రూపాయల నగదు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో సాంబశివరావు సిద్ధాంతి కుమారులు నాగేంద్ర చౌదరి చరణ్ సింగ్, మైనేని ఉమామహేశ్వర చౌదరి, నాగజ్యోతి పాల్గొన్నారు.

కొత్తగా మురిపించన్

- నియోజకవర్గంలో మరో 1,061 మందికి పింఛన్ల మంజూరు
- సెప్టెంబర్ ఒకటిన పంపిణీకి చర్యలు
- 38,830కి చేరిన లబ్ధిదారుల సంఖ్య
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పింఛన్ కోసం గుంటూరు జీజీహెచ్‌లో రామయోగి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ త్రివేణి(ఫైల్)

సత్తెనపల్లి: రాజకీయ సిఫార్సులకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితర అభాగ్యులకు పింఛన్లు మంజూరు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. లబ్ధిదారుల ఎంపికలో పూర్తిగా పారదర్శకత పాటించి రాజకీయాలు, కులం, మతం అనే తేడా లేకుండా అర్హత ఉంటే చాలు అన్నీ వర్గాల ప్రజలకు పింఛన్లు మంజూరు చేస్తు ప్రజల మన్ననలు పొందుతోంది. పింఛన్‌ల దరఖాస్తుల కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్దకు ప్రదక్షిణలు చేయకుండానే వలంటీర్లు ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు మంజూరు అవుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ల మంజూరులో మార్పులు తీసుకురావడంతో అర్హులందరికీ అందుతున్నాయి. ఏడాదికి రెండు మార్లు అర్హులందరికీ సామాజిక పింఛన్ మంజూరు అవుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ.2,250కి పెంచారు. తర్వాత రూ.2,500, అటుపిమ్మట రూ.2,750 పెంచారు. నాలుగు విడతలుగా రూ.మూడు వేల వరకు పెంచుకుంటూ పోతామని చెప్పినట్లుగానే ఇప్పటికే మూడు విడతలు పెంచారు. చివరగా వచ్చే జనవరి నుంచి పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందించనున్నారు.

నియోజకవర్గంలో లబ్ధిదారులు..

సత్తెనపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఒక పట్టణం, నాలుగు మండలాల్లో 37,769 పింఛన్లు ఉండగా తాజాగా ప్రభుత్వం కొత్తగా 1,061 పింఛన్లు మంజూరు చేసింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య మొత్తం 38,830 చేరింది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులు ఎక్కడా పక్షపాతం లేకుండా వెరిఫికేషన్ చేశారు. కొత్తగా మంజూరైన వారికి కూడా సెప్టెంబర్ ఒకటిన పింఛన్ అందించనున్నారు.

టీడీపీ హయాంలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పక్షపాతంగా జరిగేది. గ్రామాల్లో ఎంతో మంది అర్హులున్నా ఓ సంఖ్యకు మించి పెరిగేది కాదు. ఎంతో మంది అభాగ్యులు దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా నిరాశే మిగిలేది. దరఖాస్తు దారులు తమకు ఎప్పుడు పింఛన్ మంజూరవుతుంది సారూ .. అని అడిగితే ... ఇప్పుడు తీసుకుంటున్న వక్తుల్లో ఎవరో ఒకరు చావాలనే సమాధానం విని పించేది. ఏదైనా తిరకాసు జరిగిందంటే అది జన్మభూమి కమిటీ చేతి వాటమే. ఇతరుల పేర్లు తొలగించి డబ్బులు ఇచ్చిన వారి పేర్లు జత చేసే పరిస్థితి ఆ రోజుల్లో ఉండేది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆశతో ప్రతి సారీ దరఖాస్తు చేసుకున్నా చెత్తబుట్టలకే పరిమితమయ్యే దుస్థితి.

గతంలో పింఛన్ సొమ్ము అందుకునేందుకూ తప్పని తిప్పలు !

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకొర పింఛన్ లబ్ధిదారులు సైతం ఆ సొమ్ము అందుకునేందుకు నానాపాట్లు పడాల్సిన దుస్థితి. అధికారులు నాలుగైదు ఊర్లలో పంపిణీ చేయాల్సి ఉండేది. దీంతో లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పేవికావు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద తిండీ తిప్పలు లేకుండా ఉదయం నుంచే నిరీక్షించేవారు అభాగ్యులు. కొందరు వృద్ధులు పింఛన్ కోసం నిరీక్షిస్తూ సొమ్మసిల్లిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటి సమస్యలన్నింటికీ వలంటీర్ వ్యవస్థతో చెక్ పెట్టారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రస్తుతం వానొచ్చినా .. వరదొచ్చినా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ అందజేస్తూ అవ్వాతాతలు, అక్క చెల్లెమ్మల మన్ననలు పొందుతున్నారు వలంటీర్లు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో పెన్షన్‌లు, కొత్త పెన్షన్‌ల మంజూరు...

మండలం	పెన్షన్‌లు	ఎమౌంట్(రూ.)	కొత్త పెన్షన్‌లు
సత్తెనపల్లి టౌన్	6,214	1,72,96,250	189
సత్తెనపల్లి రూరల్	10,403	2,87,32,500	334
ముప్పాళ్ళ	6,007	1,64,54,750	155
రాజుపాలెం	6,911	1,90,34,500	167
నకరికల్లు	8,234	1,93,42,500	216
మొత్తం	37,769	10,08,60,500	1,061

వెరిఫికేషన్ పూర్తి చేశాం



కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేశాం. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి అర్హులా కాదా అని పూర్తి స్థాయిలో విచారించాం. ఉన్నతాధికారుల నుంచి సచివాలయాల వారీగా పింఛన్ల వివరాలు ఆన్‌లైన్‌లో వచ్చాయి. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం.

–జి.వి.సత్యనారాయణ, ఎంపీడీఓ, సత్తెనపల్లి

ఓటర్ జాబితా ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

సత్తెనపల్లి: తప్పులులేని ఓటర్ జాబితాలో భాగంగా ఇంటింటి సర్వే పెండింగ్ క్లెయిమ్స్ పూర్తి చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రైతుల పొలం పాస్ పుస్తకాలు ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూమి శిస్తు వసూలుకు సంబంధించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. సమావేశంలో సూపరిండెంట్ యు.రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు,వీఆర్ఏలు, తదితరులు ఉన్నారు. కార్డుదారులకు డోర్ స్టెప్ విధానంలో నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ చెప్పారు. మండలంలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో బుధవారం సమావేశం ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఎస్‌డీటీ అరుణ పాల్గొన్నారు.

తొలగించిన ఓటరు జాబితాపై విచారణ

నకరికల్లు: తొలగించిన ఓట్లను ఏ ప్రాతిపదికన తొలగించారన్న విషయమై ఓటర్ల ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో మండలంలో 2,553 ఓట్లను తొలగించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతేడాది జనవరి 6వ తేదీ నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను గుర్తించి ఎన్నికల నియమావళి ప్రకారం తొలగించారా లేదా అన్న విషయమై పునఃవిచారణ చేపడుతున్నట్లు తెలిపారు.



చీమలమర్రి గ్రామంలో తొలగించిన ఓట్ల వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ నగేష్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులను కలిసి తమ పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా వారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న మంత్రి అంబటి రాంబాబు వద్దకు భవన నిర్మాణ కార్మికుల సామూహిక రాయబార కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటానికి అని రాజకీయ పార్టీల వారు మద్దతు తెలపాలని విన్నవించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి ధరణికోట విమల మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనుముల వీరబ్రహ్మం, పెండ్యాల మహేష్ ,పాట్టి సూర్యప్రకాశరావు, పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు), పట్టణ కార్యదర్శి సాల్మన్ రాజు, డివిజన్ నాయకులు షేక్ సైదులు మార్బుల్ మేస్త్రి కొండలు పాల్గొన్నారు.



సీపీఎం నాయకులకు వినతి పత్రం అందిస్తున్న ప్రసాదరావు, తది తరులు

రీసర్వే ప్రక్రియను సమర్థంగా చేపట్టాలి

ముప్పాళ్ల: మండలంలో జరిగే మొదటివిడత జగనన్న భూరక్ష పథకంలో భాగంగా చేపట్టే రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టి పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పై వీఆర్వోలు, సర్వేయర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రెండు గ్రామాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఏమైనా భూములకు సంబంధించి సమస్యలుంటే త్వరితగతిన అర్జీలు స్వీకరించాలన్నారు. సర్వేనెంబర్ లేకుండా ఉన్న భూములకు సంబంధించి వివరాలు సేకరించి జిల్లా జాయింట్‌కలెక్టర్ కు నివేదికలు పంపించాలన్నారు. సర్వేప్రక్రియలో రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

అచ్చంపేటకు రెండో పీహెచ్‌సీ మంజూరు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మండలంలో రెండో పీహెచ్‌సీని మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. ఇందుకోసం బుధవారం చింతపల్లి వద్ద రెండున్న ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. భవన నిర్మాణానికి రూ.2.38 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. విస్తీర్ణ పరంగా మండలం పెద్దది కావడంతో 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేట పీహెచ్‌సీకి వచ్చేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు 28 గ్రామాలు, నాలుగు గిరిజన తండాలు ఉన్నాయన్నారు. వీటన్నింటికి కలిపి ప్రస్తుతం అచ్చంపేటలో ఉన్న పీహెచ్‌సీకి రావాలంటే దూరాభారం దృష్ట్యా రెండవ పీహెచ్‌సీని మంజూరు చేయించినట్లు చెప్పారు. చింతపల్లిలో నిర్మించే పీహెచ్‌సీ పరిధిలోకి తాళ్లచెరువు, కొత్తపల్లి, పుట్లగూడెం, చింతపల్లి, తాడువాయి, చల్లగరిక, కుంటిమద్ది, గింజుపల్లి, మాదిపాడు గ్రామాలతో పాటు కంచుబోడతండా, జడపల్లిమోటు, గింజుపల్లి తండా, సండ్ర తండాలు వస్తాయని, మిగిలిన గ్రామాలన్నీ అచ్చంపేట పీహెచ్‌సీ పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఇవికాక 13 పీహెచ్‌సీ సబ్‌సెంటర్లు, 4 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, అచ్చంపేట, పెదకూరపాడు ఎంపీపీలు భూక్యా రాజనీకృష్ణానాయక్, బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, తాళ్లచెరువు సర్పంచి కిక్కురు అర్లారెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి



సమావేశానికి హాజరైన ఎంపీపీ కోటయ్య, వైద్యులు రమాదేవి తదితరులు

క్రోసూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ డీఎస్ రమాదేవి కోరారు. స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. సభ్యులు ఎంపీడీఓ బి.మహేష్ బాబు, పీహెచ్‌సీ అదనపు వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి హాజరయ్యారు. వైద్యురాలు రమాదేవి మాట్లాడుతూ ఆస్పత్రి చుట్టూ గ్రావెల్ వేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అదే విధంగా ఆస్పత్రికి మరొక చోట స్థలం కేటాయించి అవసరమైన భవనాలు నిర్మించాలని కోరారు. స్పందించిన చైర్మన్ కోటయ్య, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ప్రతి కార్మికుడూ పేరు నమోదు చేయించుకోవాలి



సత్తెనపల్లి: ప్రతి కార్మికుడు విధిగా కార్మిక శాఖలో వారి పేరును నమోదు చేయించుకోవాలని సీనియర్ న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు అసంఘటిత కార్మికులు యొక్క హక్కులు, వారి కోసం ఉన్న చట్టాలపై బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు అందరూ గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. అలా నమోదైన కార్మికులకు మాత్రమే చట్టం కల్పించిన హక్కులు పొందే అర్హత ఉంటుందన్నారు. సత్తెనపల్లి కార్మిక శాఖ అధికారి (ఏ.ఎల్. ఓ) వి.అన్నపూర్ణ మాట్లాడుతూ కార్మిక శాఖలో ఎవరైతే పేరు నమోదు చేయించుకుంటారో వారికే కార్మిక శాఖ ద్వారా లభించే సంక్షేమ పథకాలకు అర్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలి

నకరికల్లు: ఖరీఫ్- 2023 పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటనమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. నకరికల్లులోని వరిసాగు చేస్తున్న పొలాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాగుచేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో నూతనంగా జియో ఫెన్సింగ్ విధానం అమలులో చేస్తున్నట్లు చెప్పారు. కౌలు రైతులు, ఆర్‌ఓఎఫ్ఆర్ రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ సుభాని, వై.ప్రభాకర్ పాల్గొన్నారు.



వరి పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతా సమేత శ్రీరామచంద్రుడు, లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి, గణపతి స్వామి, నాగేంద్రస్వామి, జీవధ్వజ, శిఖర, అభయాంజనేయస్వామి, నూతన యంత్ర స్థాపన, ఉష్ట్ర వాహన చతుర్దిక్షు శిలాస్థాపన ప్రతిష్టా మహోత్సవాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య చేపట్టారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంత కుమారి దంపతులు హాజరై పూజలు చేశారు. స్వామి వారికి నూతన వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, గ్రామ సర్పంచి చింతగుంట్ల అనూరాధ, హనుమంతురెడ్డి దంపతులు, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ జాని, పాగెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రతిష్టా మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

జగనన్న పాల వెల్లువ పథకం కింద రుణాలు

పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: జగనన్న పాలవెల్లువ పథకం కింద పశు పోషకులకు రుణాల అందించనున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మంగు శ్రీనివాసరావు తెలిపారు. సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్ల గ్రామ సచివాలయంలో బుధవారం రుణమేళా నిర్వహించారు. రుణమేళాకు ధూళ్లిపాళ్ల పశువైద్యాధికారి జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ మంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకం కింద అమూల్ డెయిరీకి పాలు పోసే పశుపోషకులకు రుణమేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాడి రైతులకు జీడీసీసీ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క పాడి రైతుకు ఆవుకు రూ.74,430, గేదె కొనుగోలుకు రూ.91,170 చొప్పున 11 శాతం వడ్డీతో దీర్ఘకాలిక రుణాన్ని మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే ఒక ఆవుకు రూ.40 వేలు, ఒక గేదెకు రూ. 50 వేలు చొప్పున పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా స్వల్ప కాలిక రుణాన్ని అందజేస్తారని చెప్పారు. దీనికి ఏడు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాడి రైతులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధూళ్లిపాళ్ల పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, వెలుగు సీసీ జోసెఫ్ డేనియల్ పాల్గొన్నారు.

గోళ్ళపాడు(ముప్పాళ్ల): జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి గేదెలు కొనుగోలుకు బ్యాంక్ రుణసదుపాయం కల్పించనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు తెలిపారు. మండలంలోని గోళ్లపాడు గ్రామంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలతో బుధవారం సమావేశం నిర్వహించారు. రుణ సదుపాయం అందించేందుకు గాను లబ్ధిదారుల ఎంపికకు గాను రుణమేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కరుణాకరరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అమూల్ ఉత్పత్తిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

అచ్చంపేట: అమూల్ పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి అన్నారు. మండలంలోని కోగంటివారిపాలెంలో బుధవారం రుణమేళా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మేలు జాతి గేదెలను కొనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. పాలను అమూల్ డెయిరీల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

దొడ్లేరు(క్రోసూరు): జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.శ్రీదేవి కోరారు. బుధవారం మండల ప్రత్యేక అధికారి మండలంలోని దొడ్లేరు గ్రామంలో జగనన్న కాలనీ, జగనన్నకు చెబుదాం సమస్య పరిశీలన, రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డు ఆక్రమించుకుని ఇల్లు ఏర్పాటు చేసుకున్న సమస్యపై జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేయగా సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి సూచనలు చేశారు. అదే విధంగా జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులందరికీ ఉపాధి హామీ పథకం కింద నగదు జమ చేయనున్నట్లు వివరించారు. అనంతరం రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.శివరామయ్య పాల్గొన్నారు. క్రోసూరు లో జగనన్న కాలనీలో ఎంపీడీఓ బి.మహేష్‌బాబు, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, సచివాలయ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్ పర్యటించారు.



ఎస్సీ కాలనీలో సమస్యను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి

వైఎస్సార్ సీపీలో చేరిన బీసీ కుటుంబాలు

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన బీసీ వడియరాజుల కుటుంబాలకు చెందిన 50 మంది ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాము కనుకనే ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచి ఉప్పు వెంకటేశ్వర్లు, పెద ఏగయ్య, పెద సుబ్బారావు, ప్రసాద్, లక్ష్మయ్య, చిన్న సుబ్బారావు, శ్రీను, ఏగయ్య, బాలకృష్ణ, శ్రీనివాసు, వీరబాబు, గోపి, కిషోర్, కళ్యాణ్, రామాంజనేయులు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నంబూరు వసంతకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, గ్రామ సర్పంచి చింతగుంట్ల హనుమంతరెడ్డి, గొటిక శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన బీసీ వడియరాజులు

ప్రకృతి వ్యవసాయం మేలు

రాజుపాలెం: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఖర్చు తక్కువై అధిక దిగుబడులు వస్తాయని మండల ప్రత్యేక అధికారి బి.అరుణ అన్నారు. మండలంలోని గణపవరంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటను బుధవారం పరిశీలించారు. ప్రత్యేక అధికారి రైతులతో మాట్లాడుతూ రైతులు అంతర పంటలు వేసుకోవడం వలన అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటలు పండిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత గణపవరం ఆర్బీకేలో ఎస్సీ రైతులకు పీఎండీఎస్ కిట్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి వెంకటనరసయ్య, పంచాయతీ కార్యదర్శి మహంకాళ్లమ్మ, వీఏఏలు సునీల్, వెంకయ్య, కె.జ్యోతి, ఎస్ రమణయ్య, శ్రీనివాసరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి బి.అరుణ, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు

కాంప్లెక్స్‌ల పటిష్టంతో విద్యాభివృద్ధికి దోహదం

సత్తెనపల్లి: కాంప్లెక్స్‌ల పటిష్టంతో విద్యాభివృద్ధికి దోహదపడుతుందని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు నెలకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ బుధవారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన సబ్జెక్టు(బయాలజీ) కాంప్లెక్స్, మొదటిసారిగా వ్యాయామ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ కాంప్లెక్స్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారి- 2 రాఘవేంద్రరావు పలు సూచనలు చేశారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ ప్రియదర్శిని, సెక్రెటరీ ఎం.రవిచంద్రరావు పాల్గొన్నారు.